జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM
ఆదివారం 21 12 2025
సంపుటి 1 సంచిక 30
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



### బీజేపీలో చేరిన ఆమని.
దశ, హైదరాబాద్:ప్రముఖ సినీ నటి, ఒకప్పటి స్టార్ హీరోయిన్ ఆమని భారతీయ జనతా పార్టీ లో అధికారికంగా చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో 4



### శనీ, మంగళవారాల్లో సైబర్ క్రైమ్స్ పై అవగాహన
దశ, హైదరాబాద్: ప్రతీ శని, మంగళ వారాల్లో. సిటీ లోని కాలనీల్లో సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని సీపీ సజ్జనార్ అన్నారు. 4



### ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి
దశ, యాదాద్రి భువనగిరి: నవదంపతులు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి-ఆలేరు రైలు మార్గంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. 4



## మార్చి వరకు ఎన్నికలే...
**పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఉత్సాహంతో కాంగ్రెస్.**

**దశ, వరంగల్:**
పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుంది. వీలుంటే వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ అదే ఊపులో మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలన్న నిర్ణయంతో ఉంది. ఈ మేరకు త్వరలోనే ఎన్నికల కమిషన్ కు లేఖ రాసే అవకాశముంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనుంది. త్వరలో జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులుండవు. కానీ అదే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గుర్తులుంటాయి. అందులో స్పష్టంగా ఎవరికి ఎన్ని స్థానాలు వచ్చాయన్నది తేలుతుంది. పట్టణ మిగతా 4వ పేజీలో

## మంత్రుల తీరుపై ఎమ్మెల్యేల అసంతృప్తి!



**గంటల తరబడి కూర్చోబెట్టి, కలిసినా పొడిగా స్పందించి...అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని అధిష్టానానికి ఫిర్యాదు .**

**ఆ మంత్రులు మాకొద్దు..వెంటనే మార్చండి..**

**దశ, హైదరాబాద్:**
ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు జిల్లా మంత్రుల అహంకారంపై ఆందోళన చెందుతున్నారు. ఫోన్ చేసినా స్పందించడం లేదని, కలవడానికి వెళితే సమయం ఇవ్వడం లేదని బాధపడుతున్నారు. తరచూ ఇలాగే చేస్తున్నారని, కావాలని చేస్తున్నట్లు ఉందని పేర్కొంటున్నారు. ఇలాంటి మంత్రుల కారణంగా పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి, అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. కానీ, పార్టీ నేతల్లో మాత్రం మార్పు రావడం లేదు. సొంత పార్టీ నేతలపైనే ఫిర్యాదులు చేయడం హస్తం పార్టీలో కామనే. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నేతలు పద్ధతి మార్చుకోవడం లేదు. తాజాగా సొంత మంత్రుల తీరుపైనే ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు.నియోజకవర్గ సమస్యలు చర్చించడానికి కలవడానికి వెళ్తే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. గంటల తరబడి కూర్చోబెట్టి, కలిసినా పొడిగా స్పందించి అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

## సజ్జనార్ నేతృత్వంలో సిట్... ఫోన్ ట్యాపింగ్ అప్ డేట్.




**దశ, హైదరాబాద్:**
జూన్ 2024లో తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సాధారణ పోలీస్ విచారణగా సాగుతున్న ఈ కేసును మరింత లోతుగా, పారదర్శకంగా విచారించేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ కేసును హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, దర్యాప్తులో వేగం తగ్గడం, కీలక సూత్రధారులను పట్టుకోవడంలో జాప్యం జరగడంపై ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో కేవలం కొంతమంది అధికారుల అరెస్టుతోనే ప్రక్రియ ఆగిపోయిందని, అసలైన రాజకీయ కోణాన్ని వెలికితీయడంలో ఇప్పటివరకు జరిగిన విచారణ సరిపోలేదని భావించిన సర్కార్, ఈ బాధ్యతను సజ్జనార్‌కు అప్పగించింది. తాజాగా నియమితులైన సిట్ ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? దీని వెనుక ఉన్న రాజకీయ పెద్దలెవరు? అనే కోణంలో సిట్ విచారణ జరుపుతుందని భావిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల సహాయంతో ఇజ్రాయెల్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాలను ఎలా మిగతా 4వ పేజీలో

## ఫిబ్రవరి 7 నుంచి వరల్డ్ కప్

**సొంత గడ్డపై కప్పును నిలబెట్టుకోవాలని పట్టుదలతో భారత్.**

**శుభమన్ గిల్ ఔట్.**



**దశ, ముంబై:**
టీ20 ప్రపంచకప్ 2026 కోసం భారత జట్టు ప్రకటనతో క్రికెట్ ఫీవర్ అప్పుడే మొదలైపోయింది. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీలో టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా 4వ పేజీలో



## అధికార పార్టీకి బుద్ధి చెప్పిన గ్రామ పంచాయతీల ప్రజలు:
**మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**దశ, ఇబ్రహీంపట్నం :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించి ఘన విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ, బీఆర్ఎస్ పార్టీ ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.



### లేఅవుట్ల పార్కుల కబ్జాపై హైడ్రా ఆరా ..
- సర్వేనం.403లో కబ్జాకు గురైన అసైండ్ భూమి పరిశీలన.

**దశ, పెద్ద అంబర్ పేట :** పార్కుల కబ్జాలపై వచ్చిన ఫిర్యాదుల పై హైడ్రా అధికార్లు శనివారం 4వ పేజీలో

## బెట్టింగ్ యాప్... సెలబ్రిటీల ఆస్తుల జప్తు.
**బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ భారీ చర్యలు**



4వ పేజీలో

**దశ, ముంబై:**
బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ భారీ చర్యలు చేపట్టింది. ఈడీ కోట్లాది రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. ఆస్తులు అటాచ్ అయిన వారిలో యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, ఉర్వశి రౌతేలా, సోనూ సూద్, మిమీ చక్రవర్తి, అంకుష్ హజ్రా, నేహా శర్మ ఉన్నారు.

యువరాజ్ సింగ్ 2.5 కోట్లు
రాబిన్ ఉతప్ప 8.26 లక్షలు
ఉర్వశి రౌతేలా 2.02 కోట్లు
(ఈ ఆస్తి వీరి తల్లి పేరు మీద ఉంది..)
సోనూ సూద్ 1 కోటి..
మిమీ చక్రవర్తి 59 లక్షలు
అంకుష్ హజ్రా 47.20 లక్షలు
నేహా శర్మ 1.26 కోట్లు


### సీఎం రేవంత్‌తో ఆర్బీఐ గవర్నర్ భేటీ



**దశ, హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా భేటీ అయ్యారు. బ్యాంకు బోర్డు సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్కు వచ్చిన ఆర్బీఐ గవర్నర్, జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు విభాగాల్లో అమలు చేస్తున్న సంస్కరణలను ముఖ్యమంత్రి 4వ పేజీలో

దశ
నిజం.. నిర్భయంగా..





## గజ్వేల్–చేగుంట ఆర్టీసీ బస్సు పునరుద్ధరణకు వినతి

**దౌల్తాబాద్**, దశ: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నుంచి చేగుంట వెళ్లే ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని దౌల్తాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, మహ్మద్ షాపూర్ సర్పంచ్ గంధం ముత్యాలు, ఇందుప్రియాల్ సర్పంచ్ స్వాతి స్వామి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసి డిపో మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు వారు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ బస్సు సేవలు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు అధికంగా ప్రభావితమవుతున్నారని వారు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి,మధు,మల్లేష్,వెంకట్, మహేష్,నర్సింలు,శ్రీకాంత్ తదితరులున్నారు.

# గురుకులాల్లో ఆహార విషబాధలు

❖ *కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం*

❖ *బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్*



**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో చదువుతున్న అనేక మంది విద్యార్థులు ఆహార విషబాధకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారని బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం సిరిసిల్ల కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఘటనలపై ప్రభుత్వం ఇప్పటివరకు సమగ్ర సమీక్ష చేయకపోవడం, బాధ్యత తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని తీవ్రంగా మండిపడ్డారు.గురుకులాల్లో చదువుతున్నవారంతా పేద, బలహీన వర్గాల పిల్లలేనని, అలాంటి పిల్లల భద్రతపై ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి కూడా లేకపోవడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో విచారణ చేయకపోవడం ముఖ్యమంత్రి నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. నేటి పరిస్థితుల్లో గురుకులాలకు పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు భయపడే స్థితి ఏర్పడిందంటే, ఆ దుస్థితికి పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే గొప్ప లక్ష్యంతో గురుకుల వ్యవస్థను బలోపేతం చేశారని గుర్తుచేశారు.కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ఆ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడకుండా, గురుకులాల్లో భద్రత, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించే బాధ్యతను ప్రభుత్వం వెంటనే తీసుకోవాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో అరెల్లి వినయ్ కుమార్, ఎస్ కె అప్రోచ్, హరీష్, సాయితేజ, విష్ణు, భానుతేజ, వినయ్, శ్రీకర్, వేణు, పవన్, అనీష్, రిషికేష్, మనీశార్మ సిద్దార్థ్, సాయిరాం, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ కార్యవర్గ సమావేశానికి అంతా రెడీ



**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనకు రెండేళ్లు పూర్తవుతున్నాయి. కాంగ్రెస్ పాలన తీరుపైన, ప్రజా సమస్యలపైన బీఆర్ఎస్ క్షేత్ర స్థాయిలో పోరాటాలు చేస్తున్నా, ఆ పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం రాజకీయ మౌనం పాటిస్తున్నారు. అయితే ఈ నెల 21వ తేదీన జరిగే బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం, ఎల్పీ, పార్లమెంట్ సభ్యుల సమావేశంతో కేసీఆర్ రాజకీయ మౌనం విరమిస్తారన్న ప్రచారం గులాబీ పార్టీలో సాగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు కారు పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ఈ సమావేశంలో ఏం జరగనుందో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.మరో జల ఉద్యమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారా..?ఈ నెల 21వ తేదీన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఇందులో పార్టీ కార్యవర్గ సభ్యులతోపాటు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొననున్నారు. గులాబీ బాస్ కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన తీరు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుతెన్నులపైన ప్రధానంగా చర్చ జరగనుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలు, సర్పంచ్ ఎన్నికల ఫలితాల పైన సమీక్ష జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు ప్రధానంగా నది జలాల అంశాలపై ఓ కార్యాచరణకు కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నట్లు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.



## శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి

సిపి రాధాకృష్ణన్ ను రాచకొండ సిపి సుధీర్ బాబు ఐపిఎస్ రామోజీ ఫిల్మ్ సిటీలో పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి రాకను పురస్కరించుకుని పోలీస్ శాఖ భారీ భద్రత ఏర్పాట్లు చేసిందని ఆయన అన్నారు.-(దశ, అబ్దుల్లాపూర్ మెట్ ).



## ట్విన్ టవర్స్ ను ఆవిష్కరించిన చిన జీయర్ స్వామి

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివారులో భూతల స్వర్గం ఆవిష్కారమైంది. సకల సౌకర్యాలతో కూడిన స్వర్గ తుల్యమైన అత్యాధునిక నివాస భవన సముదాయమది. 44 అంతస్తుల్లో నిర్మించిన ఆకాశ హర్మ్యం. ఒక్కో అంతస్తులో ఒకే ఒక్క విశాలమైన ఫ్లాట్. 16 వేల చదరపు అడుగుల్లో విశాలమైన అత్యాధునిక సదుపాయాలతో నిర్మితమైన ఆధునిక గృహం. ట్విన్ టవర్ ఐకానిక్ కాంప్లెక్స్ ను శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి శనివారం నాడు దీప ప్రజ్వలనతో ఆవిష్కరించారు. యూరోపియన్ దేశాల్లో మాత్రమే వినియోగించే అత్యాధునిక లిఫ్ట్ ఎలివేటర్ను కాంప్లెక్స్ కు సమకూర్చారు. ప్రారంభోత్సవ సందర్భంగా ప్రాజెక్టు ఎమ్. డీ. రఘురామి రెడ్డి మాట్లాడుతూ విలాసం అంటే ఆడంబరం కాదని అలాంటి ఇంటి సముదాయాన్ని తాము నిర్మించా మని చెప్పారు. గచ్చిబౌలీ లోని నానక్ రామ్ గుడాలో నిర్మించిన ఈ నివాస సముదాయానికి స్వచ్ఛమైన గాలి, వెలుతురు పుష్కలంగా లభించే పర్యావరణ హితంతో కూడిన అరుదైన నిర్మాణ ఇంజనీరింగ్ సాంకేతకను వినియోగించినట్లు తెలిపారు. అత్యంత ఆధునిక షిండ్లర్ టెక్నాలజీని వినియోగించి నట్లు తెలిపారు. 50 వేల చదరపు అడుగుల వైశాల్యంలో స్టార్ హోటల్ ను తలపించే క్లబ్ హౌస్ ను నిర్మించామని తెలిపారు. వ్యక్తిగత భద్రత, గోప్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టును పూర్తి చేశామని తెలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ డీ. ఎస్. ఆర్. డెవలపర్స్ అండ్ బిల్డర్స్ నిర్మించిన ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రాజెక్టు ఫౌండర్ అభిషేక్ రెడ్డి, సినీ నిర్మాత శేష గిరి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పేరు మార్పిడి నిర్ణయం వెనక్కుతీసుకోవాలి

❖ *గాంధీపథం రాష్ట్ర కన్వీనర్ బూసిరెడ్డి శంకర్రెడ్డి*




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** జాతీయ ఉపాధి హామి పథకం పేరు మార్పిడి నిర్ణయంను వెనక్కుతీసుకోవాలని గాంధీపథం రాష్ట్ర కన్వీనర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామి పథకం పేరు మార్చాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. బీజేపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడుతున్నాయని తెలిపారు. నెహ్రు, గాంధీ పేర్లను సమూలంగా తొలగించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పిడిని నిరసిస్తూ,ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గానూ గాంధీపథం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి, ఎన్ఐఏను గద్దె దింపే వరకు ఉద్యమిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 వేలకు పైగా ఉన్న గాంధీపథం క్యాడర్తో మొదట ఖమ్మం, భద్రాద్రి జిల్లాలలో నిరసన కార్యక్రమాలు మొదలుపెట్టి అన్నీ జిల్లాలో నిర్వహిస్తామన్నారు. వీటితో పాటుగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను సైతం ప్రజల్లోకి తీసుకవెళ్లి, ప్రజలకు కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గాంధీపదం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గిరిశం, సభ్యులు జ్ఞానవినోదిని, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి పేరిట మూడు కోట్లు బీమా కోసం..

❖ *పాము కాటుతో చంపించిన కొడుకులు.*






**దశ, చెన్నై:** తండ్రి పేరిట మూడు కోట్లు బీమా చేయించి ఇద్దరు కుమారులు కలిసి ఆయనను పాము కాటుతో చంపించారు. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణేశన్(56) అనే వ్యక్తి ఓ పాఠశాలలో ప్రయోగశాల సహాయకుడి పని చేస్తున్నాడు. తండ్రి పేరిట కుమారుడు దాదాపుగా రూ.3 కోట్ల రూపాయల బీమా చేయించారు. గణేశన్ పాము కాటుతో చనిపోయాడు. బీమా క్లెయిమ్‌ల కోసం ఇద్దరు కుమారులు బీమా సంస్థను కలిశారు. తండ్రి పేరిట మూడు కోట్ల రూపాయల బీమా క్లెయిమ్ ఉండడంతో పాటు బీమా సంస్థ ఉద్యోగులకు అనుమానం వచ్చింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. గణేశన్ మృతి చెందిన వారానికి ఆయనను పాము కరవడంతో ఆస్పత్రికి తరలించారు. విషపూరితమైన పాము కాకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో కుమారులు ఇద్దరు తండ్రిని నిద్ర పోతుండగా అతడి మెడ వద్ద పామును వదిలారు. పాము కరించిందని తండ్రి కేకలు వేయడంతో వెంటనే పామును చంపేశారు. అనంతరం తండ్రిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారు. అక్కడి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు తండ్రి మృతి చెందాడు. పాము కాటుతోనే తండ్రి చనిపోయాడని అందరినీ నమ్మించారు. బీమా సొమ్ము కోసం క్లెయిమ్ చేసుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## విపత్తుల నిర్వహణకు ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్

❖ *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్* ❖ *22న బూర్గంపాడులో మాక్ డ్రిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రకృతి వైపరీత్యాలు ఇతర విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందనతో ప్రాణ ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ముందస్తు అప్రమత్తత అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 22వ తేదీన విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనలతో కలిసి విపత్తుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని ప్రతి అధికారి తన పరిధిలోని సిబ్బందికి తగిన శిక్షణ అందించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మురళీ, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్ టిఓ వెంకటరమణ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు



**దశ, నడిగూడెం:** నడిగూడెం మండలం సిరిపురం ప్రభుత్వ హైస్కూల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దర్రా ఉపేందర్ మాట్లాడుతూ పాఠశాలలో గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు,అటెండర్ ,మరుగు దొడ్లు లకు నీటి సౌకర్యం,అధికారికి సంబందించినటువంటి సామాగ్రి ,తరగతి గదులకు రంగులు వేయుట, దేవాలయం వైపుఉన్నటువంటి ప్రహరీ గోడ నిర్మాణం లాంటి సదుపాయాలు అదేవిదంగా అదనపు తరగతి గదుల నిర్మాణం,ప్రత్యేక ఎడ్యుకేషన్ టీచర్ ను నియమించాలని అధికారులకు తెలియ చేశారు.

## జిల్లాలో రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు

❖ *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి నెలలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షాహీ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికుల చర్చలు సఫలం

❖ *మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు సంయుక్తంగా బాణాసంచా కాల్చి సంబురాలు*

❖ *కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మహిళా కార్మికులు*



**దశ, ఓయూ :** నాచారం పారిశ్రామికవాడలోని షాహీ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికులు గత 12 రోజులుగా నిరవధిక పోరాటం విజయవంతం అయింది.మూడు రోజులుగా జాయింట్ లేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డితో మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు మరియు కంపెనీ జీఎం మురళి తో సంయుక్తంగా నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, కార్మికులు పెట్టిన డిమాండ్లను కంపెనీ యాజమాన్యం లిఖితపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ వద్ద టపాసులు కాల్చి సంబురాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వివిఎస్. బోస్ మాట్లాడుతూ మహిళా కార్మికుల పోరాటం అద్వితీయమని,మొక్కవోని పోరాట పటిమ కనబర్చి కంపెనీ యాజమాన్యం ను ఒప్పించడంలో కీలకభూమిక పోషించారని అన్నారు. యాజమాన్యం ప్రధానంగా జీతభత్యాల పెంపు అంశంలో ఏప్రిల్ మాసం లోపు హై లెవల్ కమిటీ ద్వారా కార్మిక చట్టం ప్రకారం ఇంక్రిమెంట్లు,ఆయా విభాగాల వారీగా జీతాల పెంపుదల చేస్తామని అన్నారు. అలాగే కార్మికులపై వేధింపులు ఇకపై ఉండవని, కంపెనీలో క్యాంటీన్, మరుగుదొడ్ల సంఖ్యను పెంచుతామని, జీతాల చెల్లింపులో అనవసర తొలగింపులు ఉండవని, ఒకరోజు సెలవు పెడితే రూ.800/ లు కటింగ్ చేసే పద్ధతికి స్వస్తి పలుకుతామని, సమ్మె కాలపు వేతనం ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఐఎన్టీయూసీ నేతలు రామకృష్ణ రెడ్డి, హాబీబ్, ఏఐటీయూసీ నేతలు గిరిబాబు, అజీమ్, శేఖర్, స్వప్న, మహిళా కార్మికులు రజిత, పద్మ, షాలిని, పూజ, రంకు పాల్గొన్నారు.



## పర్యాటక రంగం అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భాగస్వాములు కావాలి

❖ *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసే బాధ్యతను సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు స్వీకరించి యువతలో చైతన్యం కలిగించే విధంగా భాగస్వాములుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి, ముక్కోటి సందర్భంగా నిర్వహించనున్న ఫెస్టివల్ను విజయవంతం చేయడానికి చేపట్టవలసిన చర్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకృతి సౌందర్యం ఆధ్యాత్మికత గిరిజన సంస్కృతి సమ్మేళనంగా ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందని అన్నారు. జిల్లాలోని పగిడేరు వేడి నీళ్లు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, కనిగిరి గుట్టలు, కిన్నెరసాని అడవీ ప్రాంతాలు వంటి అనేక విశిష్టమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటక పటంలో స్థిరపరచడానికి విస్తృత స్థాయి ప్రచారం అత్యవసరమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో విజేతలకు బహుమతులు



**దశ, దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.పరీక్షలో దౌల్తాబాద్ బాలికల ఉన్నత పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) విద్యార్థిని వైష్ణవి, దౌల్తాబాద్ బాలుర ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం) విద్యార్థి వినయ్‌కుమార్ మొదటి స్థానాల్లో నిలిచారు.విజేతలకు మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు చామకూర అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు భూపతి రెడ్డి, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..







## ఉపాధి హామీని కాపాడుకుందాం: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**దశ, ఆమనగల్లు :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అణగారిన వర్గాల హక్కుల కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు,ఎమ్మెల్యే సర్పంచులు,కార్మికులు, కర్షకులు,మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారుఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టానికి మోదీ ప్రభుత్వం 'ఉరి' వేస్తోందని, లోక్‌సభలో చర్చ లేకుండా హడావుడిగా బిల్లులు పాస్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.ఉపాధి కూలీల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు మరియు మహిళలే ఉన్నారని, కేంద్ర వైఖరి వల్ల వారి ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## గ్రూప్ త్రీ లో సీనియర్ అసిస్టెంట్ గా కొలువు



**దశ, నడిగూడెం :** నడిగూడెం గ్రామానికి చెందిన గంట పొంగు రాజ్ కుమార్ గ్రూప్ త్రీ ఫలితాల్లో టీ.జీ.పీ.ఎస్సీ.లో సీనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాదించాడు. నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న గంట పొంగు రామయ్య కుమారుడు రాజ్ కుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ అనంతరం ఆకుపాముల కోదాడ లో ఉన్నత విద్య పూర్తి చేసి సివిల్స్ ప్రిపేర్ అవుతూ గ్రూప్ త్రీ ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు ఉద్యోగం పొందడం పట్ల పలువురు అభినందించారు.

## బీఆర్ఎస్ బస్తి బాటలో సమస్యలపై పోరాటం



**దశ, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో బిఆర్ఎస్ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు పత్యా నాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ 15 వ వార్డులో కార్యకర్తలు,ప్రజలు, మహిళలతో కలిసి బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా ప్రధానంగా వార్డులో నెలకొన్న అండర్ డ్రైనేజీ,వాటర్ లైన్,తాగు నీరు, రోడ్ల గురించి ప్రజలు సమస్యలు తెలియ జేశారని,మున్సిపాలిటీలో బీఆర్ఎస్ రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అన్నారు.కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్,యూత్ వింగ్ అధ్యక్షుడు వడ్డే వెంకటేష్,నాయకులు బాలస్వామి,వస్పుల సాయిలు,రమేష్,సైదులు గౌడ్,శ్రీను నాయక్,రాంచందర్,జంతుక కిరణ్,సతీష్,గోపి,జగన్,చాంద్ పాషా,రాజు తదితరులు పాల్గొన్నారు.

## నావికాదళ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు ముఖ్యఅతిథిగా మందముల పరమేశ్వర్ రెడ్డి




**దశ, ఓయూ:** నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నాచారంలోని పలు పాఠశాలు పాల్గొన్నాయి. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో గెలిచిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పోటీల్లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్య తో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. పాఠశాలలు కూడా విద్యార్థులు క్రీడల వైపు మగ్గు చూపే విధంగా కృషి చేయాలి అన్నారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. యువత ప్రస్తుతం డ్రగ్స్ కు బానిస అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ గేమ్ లకు అలవాటు పడకుండా గ్రౌండ్ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నావికా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాచారం స్థానిక నేతలు పాల్గొన్నారు.

## సింగారం ఉపసర్పంచ్‌గా వన్నవాడ రవీందర్ రెడ్డి




**దశ, ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నజ్దిక్ సింగారం గ్రామ ఉప సర్పంచ్ గా వన్నవాడ రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికలలో భాగంగా రవీందర్ రెడ్డి నజ్దిక్ సింగారం గ్రామంలో 8వ వార్డులో వార్డు సభ్యునిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పై విజయం సాధించాడు. అనంతరం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికపై వార్డు సభ్యులు రవీందర్ రెడ్డి కి సానుకూలంగా మద్దతు ఇచ్చారు. దీంతో సింగారం ఉప సర్పంచ్ గా బిజెపి పార్టీ కి చెందిన వన్నవాడ రవీందర్ రెడ్డి నీ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఎన్నికల ధ్రువపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ .. గ్రామ అభివృద్ధిలో తాను కీలకంగా పనిచేస్తానని అన్నారు. గ్రామంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు పాలకవర్గంతో కలిసి గ్రామ అభివృద్ధిలో భాగం పంచుకుంటామన్నారు. రవీందర్ ఎన్నికపై బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రేపు పాలకవర్గం ప్రమాణ స్వీకారం గ్రామపంచాయతీలో ఉంటుందని తెలిపారు.

# షాహి కార్మికులకు సీఐటీయూ జేజేలు

- *12 రోజుల సమ్మెకు ఫలితం – 8 ప్రధాన డిమాండ్లకు యాజమాన్యం అంగీకారం*



**దశ, ఓయూ:** నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని షాహి గార్మెంట్స్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులు జీతాల పెంపు, వేధింపుల నివారణ, బోనస్‌తో పాటు హక్కుల పరిరక్షణ కోరుతూ గత 12 రోజులుగా చేపట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకత్వం సంపూర్ణ మద్దతు తెలిపి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక పాత్ర పోషించింది. సమ్మె నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు షాహి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. సీఐటీయూ నాయకత్వం జోక్యంతో యాజమాన్యాన్ని జాయింట్ లేబర్ కమిషనర్ (జెఎల్‌సీ) వద్ద చర్చలకు రావడానికి ఒప్పించడం జరిగింది. మొదటి రోజు చర్చలు విఫలమవడంతో, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. అనంతరం స్థానిక జెఎల్‌సీతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి, 19న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు సాగిన దీర్ఘ చర్చల్లో కార్మికులు చేసిన 12 డిమాండ్లలో 8 డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యం అంగీకరించిన ప్రధాన డిమాండ్లు.. ప్రతి కార్మికుడికి వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వడం రిటైర్మెంట్ బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.900 చెల్లింపు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పింపు, వర్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి కార్మికులకు ప్రాతినిధ్యం, 20 శాతం బోనస్ చెల్లింపు, కార్మికులపై వేధింపులు జరగకుండా చర్యలు, రోజుకు రూ.800 వరకు జరుగుతున్న కట్‌ను నిలిపివేయడం, 'నో వర్క్ - నో పే' అంశంపై పునర్విచారణ, ఈ అన్ని అంశాలను రాతపూర్వక ఒప్పందంగా జెఎల్‌సీ నేతృత్వంలో యాజమాన్యం, కార్మికుల సమక్షంలో కుదుర్చుకున్నారు. హై లెవల్ కమిటీ 15 రోజుల్లో కంపెనీని సందర్శించి మిగిలిన సమస్యలను పరిష్కరిస్తుందని యాజమాన్యం హామీ ఇచ్చింది. పెరిగిన వేతనాలు, ఇతర అంశాలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని మెజారిటీ కార్మికులు ఆమోదించడంతో పాటు, మిగిలిన కార్మికులకు వివరించడంతో అందరూ తిరిగి విధుల్లో చేరారు. కార్మికులు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ చర్చల సారాంశాన్ని కార్మికులకు వివరించేందుకు పి.గణేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు కోమటి రవి, ఎస్.రమా, రమేష్, శ్రీకాంత్, అశోక్, జి.శ్రీనివాసులు, వెంకన్న, టీయూసీఐ నాయకులు ప్రదీప్ రమేష్, సీపీఐ సత్యప్రసాద్, పీవోడబ్ల్యూ ఝాన్సీ, షాహి కార్మిక నాయకులు శాలిని, శ్యామల, వనిత, పూజ, దేవి, రింకు సింగ్ తదితరులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పోరాటంలో పాల్గొన్న అన్ని కార్మిక సంఘాల నాయకులు, స్థానికులు, విలేకరులు, మీడియా మిత్రులు, పోలీసులు, సీపీఎం, సీపీఐ, సీపీఐ మాస్ లైన్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు సీఐటీయూ తరపున విప్లవాత్మక అభినందనలు తెలియజేస్తున్నామని నాయకులు తెలిపారు.



## కురవి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బాదావత్ లక్ష్మిరాజునాయక్ కు ఆత్మీయసత్కారం

**దశ,మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికయిన అనంతరం మర్యాదపూర్వకంగా కలిసేందుకు తొలిసారిగా భాస్కరనిలయం కు వచ్చిన సర్పంచ్ బాదావత్ లక్ష్మి రాజునాయక్ దంపతులకు సాదర స్వాగతం పలికి ఆత్మీయసత్కారం చేసిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రమాదేవి దంపతులు, కుటుంబసభ్యులుకురవి గ్రామప్రజలు ఏకపక్షంగా 700 ఓట్ల భారీ మెజారిటీతో అందించిన ఈ.. ఘనవిజయాన్ని బాధ్యతగా భావించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాదావత్ లక్ష్మిరాజునాయక్ దంపతులు సేవలు అందించాలని ఈ.. సందర్భంగా టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కోరారు. ఈ..కార్యక్రమంలో సిహెచ్ మల్లయ్యవీరలక్ష్మి దంపతులు, బిఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు కొణతం విజయ్, యువజన విభాగం నాయకులు దుడ్డెల వినోద్, వార్డ్ సభ్యుడు రాగం వీరభద్రం, మాజీ వార్డ్ సభ్యుడు ఇరుగు వెంకన్న, పడిదల నారాయణ,సిహెచ్ దుర్గాభాస్కర్ పాల్గొన్నారు.



## సైబర్ సురక్షిత నగరంగా తీర్చిదిద్దాలి: డీసీపీ బాలస్వామి

- *తార్నాకలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం*

**దశ, ఓయూ :** తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఈస్ట్ జోన్ సైబర్ సెల్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి హాజరై మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, వాట్సాప్ హ్యాకింగ్ వంటి ఘటనలు పెరుగుతున్నాయని, వాటి నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ సురక్షిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో దేశంలో ఇలాంటి నేరాలకు పడుతున్న వివిధ రాష్ట్రాలలో ఉన్న 325 మంది నేరస్తులను పట్టుకున్నామని, ఇతర దేశాలలో ఉంటూ నేరాలకు పాల్పడుతున్నవారిని పట్టుకునేందుకు అక్కడి చట్టాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సైబర్ సెల్ ఎస్సై మేఘన మాట్లాడుతూ గతంలో జరిగిన సైబర్ నేరాల ఉదాహరణలను వివరించి, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రావు, జనరల్ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, శ్రీలత, ఖలీల్, నారాయణరెడ్డి, నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జలంధర్ రెడ్డి, డాక్టర్ టీవీ రావు, హరికుమారి, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివాజీ, నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డ్ భూములను కాపాడండి

- *స్థలాలను స్వాధీనం చేసుకొని పరిశ్రమలు నెలకొలపాలి*
- *నిరుద్యోగ ముస్లింలకు ఉపాధి కల్పించాలి*
- *అర్హులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి*
- *అధికారులకు ముస్లిం సోదరుల విజ్ఞప్తి*




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ బోర్డు భూములకు రక్షణ లేకుండా పోయిందని అట్టి భూములకు రక్షణ కల్పిస్తూ అధికారులు చర్యలు చేపట్టాలని బీ.సి.సి జామా మజీద్ అధ్యక్షులు మస్తాన్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మహమ్మద్ రియాజ్ లు సంబంధిత శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ బోర్డ్ భూముల ఆక్రమణపై గతంలో అధికారులకు ఇటీవల మంత్రి అజారుద్దీన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఫిర్యాదు మేరకు మూడు రోజుల కిందట ప్రభుత్వ శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాలలో కబ్జాకు గురికాబడిన వక్ఫ్ బోర్డ్ భూముల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని ఆ స్థలాలలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ ముస్లిం యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ముస్లింలలో నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని వారికి ఉద్యోగాలు రావాలంటే వక్ఫ్ బోర్డ్ కాళీ భూములలో నూతన పరిశ్రమ లు స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.

## టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేయాలి

- *జిఎం(పర్సనల్) వెల్ఫేర్ జి.వి.కిరణ్ కుమార్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కారుణ్య నియమకాలు టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేయాలని జిఎం(పర్సనల్)వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ఆదేశించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో శనివారం జి.వి. కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్యనియామకాల ద్వారా సంస్థలో నియామకమయ్యే వారసులకు సంబంధించిన ఓఎస్ఎల్ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని తెలిపారు. సిఎంపిఎఫ్, సిపిఆర్ఎంఎస్ యొక్క జీవన్ ప్రమాన్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్)రెన్యూవల్ ల గురించి ఈపిఆర్ నందు ఉద్యోగి జీవిత భాగస్వామి కుటుంబ సభ్యుల యొక్క పూర్తి వివరాలను నమోదు చేయటం విషయాల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణ రావు, ఎస్.వేంకటేశ్వర రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కే.ప్రవీణ్ కుమార్, సీనియర్ పిఓలు ఎం.శ్రీనివాస్, బి.రణదీప్ గౌడ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, సీనియర్ ఆసిస్టంట్ ఎం.శ్యామ్ కిరణ్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం సాధించొచ్చు

**దశ, నడిగూడెం :** మండల కేంద్రమైన నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారము మిత్ర (మైండ్ ఇన్ ట్రైనింగ్ ఫర్ రైట్ అవేర్నెస్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆనాపాన ధ్యాన శిక్షణ ఇచ్చారు. గురుకుల విద్యాలయాల సంస్థ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు విపశ్యన ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్ దమ్మ నాగార్జున సంయుక్త ఆధ్వర్యంలో మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎస్ఎన్ గోయెంకా బోధించిన ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. పరీక్షల భయం, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తేనే విజయం సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఏకాగ్రతకు ధ్యానం ఎంతో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. పంచశీలాల గురించి నిర్వాహకులు బాలికలకు వివరించారు. అబద్ధం ఆడ వద్దని, దొంగతనాలు చేయవద్దని, జీవహింస కు పాల్పడవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సరైన జీవన విధానాన్ని అనుసరించాలని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వాణి మాట్లాడుతూ ధ్యానం ఏకాగ్రతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను జీవితంలో అమలు చేయాలన్నారు. ఈ విధమైన ధ్యాన శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. నాగార్జునసాగర్ విపశ్యన కేంద్రం ప్రతినిధి బృందం సురేఖ, అంజన, మంజుల,శాంతి,జయ,ప్రహల్లాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యతప్రతి ఒక్కరిపై ఉంది

- *జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయస్థానాలకు,న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు. సమసమాజ స్థాపన సమానత్వం సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ జాతీయ అధ్యక్షురాలు కె.సుజాత చౌదంతి అధ్యక్షతన నిర్వహించిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాకుండా దేశ ప్రజల జీవన విధానాన్ని దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత, న్యాయమూర్తులు కిరణ్ కుమార్, కవిత, రాజేందర్, సుచరిత, రవికుమార్, వినయ్ కుమార్, సూరెడ్డి, లక్కినేని సత్యనారాయణ, ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ బాధ్యులు శాంసన్, దేవరాజ్ గౌడ్, లక్ష్మీదేవి, సైనీ నాగేందర్, అదనం కామర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రుల తీరుపై ఎమ్మెల్యేల అసంతృప్తి!

**మొదటి పేజీ తరువాయి**
వెల్లడించారు.ప్రస్తుత జిల్లా మంత్రుల తీరుతో విసిగిపోతున్నామని, పార్టీ క్యాడర్‌లోనూ నైరాష్యం నెలకొందని బాధపడుతున్నారు. మంత్రి అండగా ఉంటే కార్యడర్ దేనికైనా సిద్ధంగా ఉంటుందని, కార్యకర్తల కారణంగానే ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ గెలిచిన తర్వాత పదవి రావడంతో కళ్లు నెత్తికెక్కినట్లు వ్యవహరిస్తున్నారు అని హస్తం నేతలు గుసగుసలాడుతున్నారు. పార్టీలో ఐక్యత కోల్పోకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రుల వ్యవహారం మారాలని కోరారు. ఈ అంతర్గత గొడవ ప్రభుత్వంలో మార్పులకు దారితీసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా.

## బీజేపీలో చేరిన ఆమని.

**దశ, హైదరాబాద్:**
ప్రముఖ సినీ నటి, ఒకప్పటి స్టార్ హీరోయిన్ ఆమని భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమని బీజేపీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆమెకు పార్టీ సభ్యత్వాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ



కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఆమనితో పాటు ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా పార్టీలో చేరారు.

### ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి...
## నవదంపతులు మృతి



**దశ, యాదాద్రి భువనగిరి:**నవదంపతులు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి ఆలేరు రైలు మార్గంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎపిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సింహాచలం(25), భవాని(22) రెండు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. సింహాచలం హైదరాబాద్‌లో ఓ రసాయన పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జగద్గిరిగుట్టలోని గాంధీనగర్‌లో అద్దె ఇల్లు తీసుకొని నివాసం ఉంటున్నారు. విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కారు. వంగపల్లి రైల్వే స్టేషన్ దాటిని తరువాత ఇద్దరు డోర్ వద్ద నిల్చొని ఉన్నారు. డోర్ నుంచి ఇద్దరు కిందపడడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ట్రాక్‌మెన్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. దంపతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

## మార్చి వరకు ఎన్నికలే...

**మొదటి పేజీ తరువాయి**
ప్రాంత ఓటర్లు తమకు పట్టం కడతారని కాంగ్రెస్ భావిస్తుంది. ప్రభుత్వం తన పట్టును పట్టణాల్లో నిలుపుకునేందుకు ఈ మేరకు త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరిపితే ఆశించిన ఫలితాలు దక్కుతాయని కాంగ్రెస్‌భావిస్తుంది.ముందుగా పట్టణాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటలను ఉండేలా ప్లాన్ చేసుకుంటుంది.మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వెళితే మంచి ఫలితాలు సాధించవచ్చని నమ్ముతుంది. బీసీలు అండగా నిలుస్తారని, తద్వారా మున్సిపల్ ఎన్నికల్లో కూడా జెండా ఎగురవేయవచ్చని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఈ మేరకు మంత్రి వర్గ సమావేశంలో చర్చించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేఖ రాయాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత జడ్పీ ఎన్నికలు నిర్వహించాలన్నది ఎన్నికల కమిషన్ అభిప్రాయం కావడంతో ఆ మేరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అంతా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద ఇక మరో మూడు నాలుగు నెలలు తెలంగాణలో ఎన్నికల వేడి కొనసాగే అవకాశముంది.

### సజ్జనార్ నేతృత్వంలో సిట్...
## ఫోన్ ట్యాపింగ్ అప్ డేట్.

**మొదటి పేజీ తరువాయి**
వాడారు? అనేది నిగ్గు తేల్చనుంది. ఎస్ఐబీ కార్యాలయంలో సాక్ష్యాలను మాయం చేసేందుకు ధ్వంసం చేసిన కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌ల నుంచి డేటాను రీట్రీవ్ చేయడంపై దృష్టి పెట్టనుంది. హవాలా మార్గాల్లో నగదు రవాణాకు మరియు ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల ఫోన్లను ట్రాక్ చేయడానికి ఈ వ్యవస్థను ఎలా ఉపయోగించుకున్నారో సిట్ ఆధారాలు సేకరిస్తుందివివాదాస్పద, క్లిష్టమైన కేసులను ఛేదించడంలో సీనియర్ అధికారి వీసీ సజ్జనార్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. టెక్నాలజీపై అవగాహన ఉండటంతో పాటు, కఠినమైన అధికారిగా ఆయనకున్న ఇమేజ్ ఈ కేసులో బాధితులకు నమ్మకాన్ని కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆయనకు సహకరించేందుకు మరికొందరు దక్షత కలిగిన అధికారులను కూడా ఈ బృందంలో చేర్చారు. నిందితులను అరెస్టు చేసి చాలా రోజులు జైల్లో పెట్టారు. ప్రభాకర్ రావును అమెరికా నుంచి రప్పించి ప్రశ్నించారు. అయితే ఈ కేసులో ఆధారాలేమీ లభించడండ లేదని తెలుస్తోంది. అందుకే సజ్జనార్ రంగంలోకి దింపారని భావిస్తున్నారు. సిట్ రంగంలోకి దిగిన తర్వాత ఈ కేసులో కీలకమైన మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారని అప్పటి విపక్ష నేతలు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ సహా చాలా మంది ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఇంటలిజెన్స్ విభాగంలో అత్యంత సున్నితమైన డేటా కనిపించుకండా పోవడంతో విచారణ చేపట్టారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. కానీ ఆధారాలు సేకరించడంలో పోలీసులు సక్సెస్ లేకపోవడంతో సిట్ కు కేసును అప్పగించాలని చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# బెట్టింగ్ యాప్...
# సెలబ్రిటీల ఆస్తుల జప్తు.

**మొదటి పేజీ తరువాయి**
ఈడీ నేటి చర్యలో భాగంగా 7.93 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది..
ఇంతకుముందు ఇదే కేసులో ఈడీ శిఖర్ ధావన్ ఆస్తులను 4.55 కోట్ల రూపాయలు జప్తు చేసింది.
సురేష్ రైనా ఆస్తులను 6.64 కోట్ల రూపాయలు అటాచ్ చేసింది.
ఇప్పటివరకు 1x బెట్ కేసులో ఈడీ 19.07 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది.

**కేసు ఏమిటి...**
ఈడీ దర్యాప్తులో 1xBet, దాని ఇతర బ్రాండ్లు 1xBat, స్పోర్టింగ్ లైన్స్ భారతదేశంలో ఎటువంటి అనుమతి లేకుండా ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయని తేలింది.ఈ సెలబ్రిటీలు విదేశీ కంపెనీలతో ఎండార్స్‌మెంట్ అంటే ప్రకటనలఒప్పందాలుచేసుకున్నారని, 1xBet ప్రమోషన్ కోసం వీడియోలు, సోషల్ మీడియా పోస్ట్‌ల ద్వారా ప్రకటనలు చేశారని దర్యాప్తులో తేలింది.ఈ చెల్లింపులు నేరుగా భారతదేశంలో



కాకుండా, అసలు మూలాన్ని దాచిపెట్టడానికి విదేశీ మార్గాల ద్వారా మళ్లించారు. ఈడీ ప్రకారం, ఈ డబ్బు అక్రమ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బు, దానిని చట్టబద్ధం చేయడానికి ఈ ఒప్పందాలు చేసుకున్నారు. ఈడీ దర్యాప్తులో 1xBet భారతదేశంలో బెట్టింగ్ కోసం వేలాది నకిలీ లేదా ఇతరుల పేర్లతో ఖాతాలను ఉపయోగించినట్లు తేలింది. ఇప్పటివరకు 6000కు పైగా ఇలాంటి ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాలలో బెట్టింగ్ డబ్బు జమ చేశారు, ఆపై డబ్బును ట్రాక్ చేయకుండా ఉండటానికి అనేకసార్లు వివిధ చెల్లింపు గేట్‌వేల ద్వారా బదిలీ చేశారు. ఈడీ దేశంలోని నాలుగు చెల్లింపు గేట్‌వేలపై దాడులు నిర్వహించింది. ఇప్పటివరకు 60కి పైగా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఈ ఖాతాలలో సుమారు 4 కోట్ల రూపాయలను నిలిపివేశారు.

## సీఎం రేవంత్‌తో ఆర్బీఐ గవర్నర్ భేటీ

**మొదటి పేజీ తరువాయి**
ఆర్బీఐ గవర్నర్‌కు వివరించారు.విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలు, మూడో డిస్కం ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రశంసించారు. మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే, తెలంగాణలో క్రమబద్ధం గాని డీపాజీట్ పథకాలను నిషేధంయాక్ట్ను నోటిపై చేయాలని ఆర్బీఐ గవర్నర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ని కోరారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్ఫేస్ (ULI) విషయంలో ఆర్బీఐ తీసుకుంటున్న చొరవతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్ల క్లెయిమ్ క్యాంపెయినింగ్ తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శని, మంగళవారాల్లో సైబర్ క్రైమ్స్ పై అవగాహన

**హైదరాబాద్ సీపీ సజ్జనార్**
**దశ, హైదరాబాద్:** ప్రతీ శని, మంగళ వారాల్లో.. సిటీ లోని కాలనీల్లో సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని సీపీ సజ్జనార్ అన్నారు. అవగాహన తోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. హైదరాబాద్ నగరంలో రోజుకు కోటి రూపాయల సైబర్ మోసం జరుగుతోంది. సైబర్ క్రైమ్స్ పెద్ద సవాల్ గా మారింది. భయాన్ని, ఆశ ను టార్గెట్ గా చేసుకుంటారు సైబర్ నేరగాళ్లు. డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ కేసులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఎలాంటి అనుమానిత కాల్స్ వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వండి.. లేదా 1930 కి కాల్ చేయండని అన్నారు.
ఏపీకే ఫైల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండండి. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి



పండుగలను టార్గెట్ చేస్తుంటారు సైబర్ నేరగాళ్లు. గిఫ్ట్ లు, కూపన్లు, వోచర్లు, ఫెస్టివల్ ఆఫర్లు అంటూ ట్రాప్ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు.. అప్రమత్తంగా ఉండండని అన్నారు.



## లేఅవుట్ల పార్క్‌ల కబ్జాపై హైడ్రా ఆరా ..

**మొదటి పేజీ తరువాయి**
అబ్దుల్లాపూర్మెట్ పసుమాములలో పర్యటించి వివరాలు సేకరించారు. వసుమాములలోని సాధన లేఅవుట్, ఇటుకల లేఅవుట్(రాళ్లు లేనిది, రాళ్లు ఉన్నది)లో గల చాల పార్కు స్థలాలు, టెంపుల్ స్థలాలు, హాస్పిటల్ స్థలాలు, పబ్లిక్ రోడ్లు కబ్జా చేసి ప్రీకాస్ట్ వాల్స్ ఏర్పాటు చేసి సేల్ డీడ్స్ చేస్తున్నారని స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో అధికార్లు స్వయంగా వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా కబ్జాకు గురైన పార్కుల వివరాలు హైడ్రా అధికార్లు ఫిర్యాదు చేసిన వారి నుండి సేకరించారు. అదే విధంగా పసుమాముల సర్వేనంబర్ 403లోని అసైండ్ ల్యాండ్లో ప్లాట్స్ చేసి కబ్జాకు పాల్పడిన 2.11 ఎకరాల స్థలాన్ని హైడ్రా అధికార్లు పరిశీలించారు. కబ్జాలపై పూర్తి స్థాయి విచారణ చేసి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికార్లు తెలిపారు.

# ఫిబ్రవరి 7 నుంచి వరల్డ్ కప్

**మొదటి పేజీ తరువాయి**
బరిలోకి దిగుతోంది. గత ఏడాది (2024) ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ట్రోఫీని ముద్దాడిన భారత్, ఈసారి సొంత గడ్డపై కప్పును నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టు కూడా వరుసగా రెండుసార్లు విజేతగా నిలవలేదు. మరి సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత్ ఆ రికార్డును తిరగరాస్తుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ప్రపంచకప్ చరిత్రను ఒకసారి గమనిస్తే.. భారత్ ఇప్పటివరకు రెండుసార్లు (2007, 2024) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లతో కలిసి రెండుసార్లు ట్రోఫీ గెలిచిన అతికొద్ది జట్ల జాబితాలో భారత్ ఒకటి. 2007లో ధోనీ సారథ్యంలో తొలి కప్పును గెలిచిన టీమ్ ఇండియా, ఆ తర్వాత 2014లో రన్నరప్‌గా, 2016, 2022లో సెమీఫైనలిస్ట్‌గా నిలిచింది. గత 9 ఎడిషన్లలో పాల్గొన్న భారత్, అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందింది.గణాంకాల పరంగా చూస్తే టీమిండియా రికార్డులు అద్భుతంగా ఉన్నాయి. ఇప్పటివరకు ఆడిన 52 మ్యాచ్‌లలో భారత్ 36 సార్లు విజయం సాధించగా, కేవలం 15 సార్లు మాత్రమే ఓటమిని చవిచూసింది. ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు. ముఖ్యంగా పాకిస్థాన్‌పై భారత్‌కు తిరుగులేని రికార్డు ఉంది. ఆ జట్టును ఇప్పటివరకు 7 సార్లు ఓడించింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా వంటి దిగ్గజ జట్లపై కూడా భారత్ పైచేయి సాధించింది. అయితే




శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు మాత్రం వరల్డ్ కప్ వేదికలపై భారత్‌కు గట్టి సవాలుగా నిలుస్తూ వస్తున్నాయి.ఈసారి జరగబోయే 2026 ప్రపంచకప్ ఒక కొత్త శకానికి నాంది పలకనుంది. గత 18 ఏళ్లలో తొలిసారిగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు లేకుండా భారత్ ఐసీసీ టోర్నీలో బరిలోకి దిగుతోంది.టీ20వరల్డ్‌కప్‌ప్రారంభమైనప్పటి నుంచి (2007) అన్ని ఎడిషన్లలో ఆడిన ఏకైక ఆటగాడు రోహిత్ శర్మ. ఇప్పుడు ఆ బాధ్యతను యువ రక్తం భుజానికెత్తుకోనుంది. అనుభవం లేకపోయినా, దూకుడున్న కుర్రాళ్లతో భారత్ హ్యాట్రిక్ దిశగా అడుగులు వేస్తోంది.

**శుభమన్ గిల్ ఔట్.**
T20 క్రికెట్ అతిపెద్ద పండుగ, అంటే T20 ప్రపంచ కప్, వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనుంది. ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (BCCI) ఈ ప్రపంచ టోర్నమెంట్ కోసం భారతదేశం 15 మంది సభ్యుల క్రికెట్ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ 2026 T20 ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా ఉంటారు. జట్టు నుంచి ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్‌ను తప్పించారు. ప్రపంచ కప్ కోసం భారత జట్టులో నలుగురు బ్యాట్స్‌మెన్‌లు, ఇద్దరు వికెట్ కీపర్‌లు, ఇద్దరు స్పిన్ ఆల్ రౌండర్‌లు, ఇద్దరు పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్‌లు, ఇద్దరు స్పిన్నర్‌లు, ముగ్గురు పేస్ బౌలర్‌లను ఎంపిక చేసింది. 2026 T20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు భారతదేశం, శ్రీలంకలో ఆడనున్నాయి. ఈ నేపథ్యంలో, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని BCCI 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది.

**ప్రపంచ కప్ కోసం**
**భారతదేశం 15 మంది సభ్యుల జట్టు**
నలుగురు బ్యాట్స్‌మెన్‌లు సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, రింకు సింగ్
ఇద్దరు వికెట్ కీపర్‌లు సంజు శాంసన్ (వికెట్ కీపర్) ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్)
నలుగురు ఆల్ రౌండర్‌లు శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ (వైస్‌కకెప్టెన్)
ఐదుగురు బౌలర్‌లు అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి

**భారతదేశం షెడ్యూల్ ఇదే.**
2026 T20 ప్రపంచ కప్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. ఈ 20 జట్లన్నీ నాలుగు గ్రూపులుగా విభజించారు. భారత్ గ్రూప్‌ఎలో ఉంది. ఈ గ్రూప్‌లో భారతదేశంతో పాటు USA, నమీబియా, నెదర్లాండ్స్, పాకిస్తాన్ ఉన్నాయి. భారతదేశంలో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలలో అన్ని మ్యాచ్‌లు ఆడతారు. పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుకోకపోతే, ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది. పాకిస్తాన్ జట్టు తమ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడుతుంది. పాకిస్తాన్ సెమీఫైనల్, ఫైనల్‌కు చేరుకుంటే, వారి నాకౌట్ మ్యాచ్‌లు శ్రీలంకలోనే ఆడతారు. ప్రపంచ కప్ లీగ్ దశలో భారతదేశం షెడ్యూల్

**ఫిబ్రవరి 7 USAతో మ్యాచ్**
**ఫిబ్రవరి 12 నమీబియాతో మ్యాచ్**
**ఫిబ్రవరి 15 పాకిస్తాన్‌తో మ్యాచ్**
**ఫిబ్రవరి 18 నెదర్లాండ్స్‌తో మ్యాచ్**

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.